సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 20 । మే । 2023



..ఉద్యోగాల పేరిట టోకరా

సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.50 లక్షలకు పైగా వసూళ్లు చేసిన వ్యవహారం వెలుగుచూసింది. 8లో



నకిలీ విత్తనాలు విక్రయించొద్దు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీలర్లను పోలీసు, వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 27°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

ఇల్లెందుకూ సీతారామ..

ప్రాజెక్ట్‌లో మళ్లీ చోటు కల్పించిన సాగునీటి శాఖ

- రూ.3,200 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు
- కొత్తగా 1.16 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు
- ఇల్లెందు కాల్వ, మారెళ్లపాడు లిఫ్ట్‌ల నిర్మాణం
- కేంద్ర జలవనరుల సంఘానికి సవరించిన డీపీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ బహుళార్థ సాధక ప్రాజెక్టులో ఇల్లెందు నియోజవర్గానికీ స్థానం దక్కింది. గతంలో ఈ ప్రాంతాన్ని ప్రాజెక్టు పరిధి నుంచి పక్కన పెట్టగా, సవరించిన డీపీఆర్(డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు)లో చేర్చారు. ఈ మేరకు డీపీఆర్‌ను సాగునీటి శాఖ ఇంజనీరింగ్ విభాగం కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ)కి సమర్పించింది. సీడబ్ల్యూసీ ఆమోదిస్తే తిరిగి ఇల్లెందు నియోజకవర్గానికి గోదావరి జలాలు వచ్చే అవకాశం ఉంది. ఏడేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు తొలి అడుగు పడింది ఇల్లెందు నియోజవర్గంలోనే కావడం గమనార్హం. సీతారామకు సంబంధించి ముందుగా ఖరారు చేసిన డీపీఆర్‌లో టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద భారీ రిజర్వాయర్‌ను నిర్మించాల్సి ఉంది. దీంతో 2016, ఫిబ్రవరి 16న అక్కడే ప్రాజెక్టు పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. కానీ ఆ తర్వాత రిజర్వ్ ఫారెస్ట్, కిన్నెరసాని అభయారణ్యం, రైల్వే ట్రాకుల కారణంగా ఇబ్బందులు రావడంతో ప్రాజెక్టు స్వరూపాన్ని చాలా వరకు మార్చాల్సి వచ్చింది. దీంతో సీతారామ ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందే నియోజకవర్గాల్లో ఇల్లెందుకు స్థానం దక్కకుండా పోయింది. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ పలుమార్లు సీఎం కేసీఆర్‌ను కలిసి విన్నవించింది. దీంతో సాగునీటి శాఖ ఈ ఏడాది ఆరంభంలోనే కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తాజాగా సవరించిన డీపీఆర్‌లో ఇల్లెందుకు చోటు కల్పిస్తూ కేంద్ర జలవనరుల సంఘం చెంతకు చేరింది.



సీతారామ ఎత్తిపోతల పథకం

కొత్తగా 1.16 లక్షల ఎకరాలు

సవరించిన డీపీఆర్ ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో కొత్తగా 1.16 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఇందులో ఇల్లెందు కాలువ ద్వారా 1,00,405 ఎకరాలు, అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా 16,796 ఎకరాలకు నీరు అందివ్వబోతున్నట్టు తాజా డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఇల్లెందు కాలువ ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు సాగు నీరు అందనుంది. ఖమ్మం జిల్లా పరిధిలో వైరా, పాలేరు నియోజకవర్గాలకు, మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఇల్లెందు, డోర్నకల్ నియోజకవర్గల్లోని పలు మండలాలకు నీరు అందనుంది. దీనికి అనుగుణంగా పలు చోట్ల పంప్ హౌస్‌లు, కాల్వలు నిర్మించాల్సి ఉంది. దీని కోసం రూ. 3,200 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇక మారెళ్లపాడు ఎత్తిపోతల ద్వారా అశ్వాపురం మండలంలోని ఎనిమిది గ్రామాల్లో 15,796 ఎకరాలకు సాగునీరు అందుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు.

రోళ్లపాడు కీలకం

సీతారామ తొలిదశలో కీలకంగా ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కి తిరిగి ప్రాధాన్యం దక్కింది. వివిధ దశల్లో ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలు జూలూరుపాడు కెనాల్ ద్వారా ఇల్లెందు శివారులో ఉన్న సింగరేణి మండలంలో సముద్ర మట్టానికి 175 అడుగుల ఎత్తులో ఉన్న లలితాపురం చెరువుకు చేరుకుంటాయి. అక్కడి నుంచి ఎత్తిపోతల ద్వారా 216 అడుగుల ఎత్తులో ఉన్న రోళ్లపాడు రిజర్వాయర్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి రెండు క్వాలల ద్వారా టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. జూలూరుపాడు కెనాల్–లలితాపురం ట్యాంక్‌లను ఆధారంగా చేసుకుని రఘునాథపాలెం, సింగరేణి, ఖమ్మం అర్బన్ మండలాల్లోని గ్రామాలకు నీరు చేరేలా కాల్వలు తవ్వనున్నారు. దీంతోపాటు రోళ్లపాడు రిజర్వాయర్ నుంచి జిల్లాలోనే అత్యంత ఎత్తులో (267 అడుగులు) ఉన్న ఇల్లెందు మండలం రొంపేడు పరిసర ప్రాంతాలకు నీరు అందివ్వనున్నారు.

భద్రాద్రికే సింహభాగం

సీతారామ ప్రాజెక్టు మొదటి డీపీఆర్‌లో ఆయకట్టు 6.74 లక్షల ఎకరాలుగా ఉంది. కొత్తగా ఇల్లెందు కాల్వను ప్రతిపాదించడంతో ఆయకట్టు సామర్థ్యం 7.84 లక్షల ఎకరాలకు చేరుకుంది. మొత్తం మూడు జిల్లాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది. ఇందులో గరిష్టంగా ఖమ్మం జిల్లాలో 48 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఆ తర్వాత స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 42 వేల ఎకరాలతో ఉంది. మూడు జిల్లాల్లో విస్తరించిన ఇల్లెందు నియోజకవర్గం పరిధిలో 65 వేల ఎకరాలు ఉండగా, 25 వేల ఎకరాల ఆయకట్టుతో వైరా రెండో స్థానంలో ఉంది. అతి తక్కువగా డోర్నకల్ నియోజకవర్గంలో 263 ఎకరాలు, కొత్తగూడెం పరిధిలో 500 ఎకరాల విస్తీర్ణం ఉన్నది.

'బయ్యారం' ఎత్తు పెంపు

సీతారామలో ప్రాజెక్టులో ఇల్లెందు నియోజకవర్గానికి సంబంధించి బయ్యారం పెద్ద చెరువు కీలకం కానుంది. ప్రస్తుతం ఈ చెరువు మత్తడి 16 అడుగులు ఉండగా మరో మూడు అడుగులు మేర పెంచి నీటి నిల్వ సామర్థ్యం పెంచాలని నిర్ణయించారు. బయ్యారం చెరువును ఆలంబనగా చేసుకుని మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాలకు సాగునీరు అందించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు.

జిల్లా	నియోజకవర్గం	ఆయకట్టు
భద్రాద్రి కొత్తగూడెం	ఇల్లెందు	65,483
భద్రాద్రి కొత్తగూడెం	పినపాక	15,796
భద్రాద్రి కొత్తగూడెం	కొత్తగూడెం	500
ఖమ్మం	పాలేరు	7,299
ఖమ్మం	వైరా	25,524
ఖమ్మం	ఖమ్మం	1,336
మహబూబాబాద్	డోర్నకల్	263
మొత్తం		1.16 లక్షల ఎకరాలు

న్యూస్‌రీల్

డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ప్రశాంతం



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం సెషన్‌లో 120 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 86 మంది హాజరయ్యారు. 34 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 82 మంది హాజరయ్యారని, 38 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. భద్రాచలం, కరకగూడెం ప్రాంతాలకు చెందిన ఇద్దరు మహిళా అభ్యర్థులు ఉదయం 9.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రానికి రాగా అప్పటికే గేటు మూసివేశారు. దీంతో వారిని అధికారులు పరీక్షకు అనుమతించలేదు. పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు సందర్శించి వసతులను పరిశీలించారు.

నేడు జాబ్‌మేళా

కొత్తగూడెంటౌన్: రుద్రంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో శనివారం నిర్వహించనున్న జాబ్‌మేళాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వేల్పుల విజేత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ 120, మార్కెటింగ్ మేనేజర్స్ 20, టెలీకాలర్స్ 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ అర్హత కలిగినవారు హాజరుకావాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నియామకాలు ఉంటాయని తెలిపారు.

29న ఖమ్మంలో..

చుంచుపల్లి: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఖమ్మంలో ఈ నెల 29న నిర్వహించే మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కోరారు. శుక్రవారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు గోపాలరావు, ఆళ్ల మురళి, నాగేందర్, త్రివేణి, తాండ్ర నాగబాబు, చీకటి కార్తీక్, దుర్గారాశి సతీష్, పాలకోట రాజు, నిరంజన్ రెడ్డి, పూణెం శ్రీనివాస్, అడపా నవీన్, శ్యామ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యకారిణి సాహితికి శోభానాయుడు అవార్డు



సాహితిని అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కొత్తగూడెంటౌన్: ఈ నెల 14న దుబాయిలో జరిగిన అంతర్జాతీయ నృత్య పోటీల్లో కొత్తగూడేనికి చెందిన సాహితికి శోభానాయుడు అవార్డు రావడం అభినందనీయమని నేషనల్ హ్యూమన్ రైట్స్ ఉమెన్ చైల్డ్ ప్రొటెక్షన్ జాతీయ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. అంతర్జాతీయస్థాయిలో కూచిపూడి నృత్యంలో జూనియర్ విభాగంలో బేబి సాహితి ప్రథమస్థానం సాధించిందని పేర్కొన్నారు. చిన్నారని అభినందించిన వారిలో శ్రీనివాస్‌తోపాటు సూరంపూడి గాంధీ, మాధవి, మురళీధర్, ఏ.పద్మావతి, కీర్తి, జ్యోతి, సుభాష్ ఉన్నారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూడా చిన్నారని ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు డీఈఓ అభినందన

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు జిల్లాలో 79 మంది విద్యార్థుల ఎంపిక కావడం పట్ల డీఈఓ సోమశేఖరశర్మ హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం ఉపకారవేతనం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

మెడికల్ ఆఫీసర్ జాబితా వెల్లడి

చుంచుపల్లి: మెడికల్ ఆఫీసర్ (ఆర్‌బీఎస్‌కె) పోస్టులకు తాత్కాలిక జాబితాను జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ జేవీఎల్.శిరీష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ఖాళీ పోస్టులు ఉండగా, గతంలో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 24 వరకు తెలపాలని కోరారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారి సేవలో స్థపతి వల్లినాయగం తదితరులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అమ్మవారికి శుక్రవారం పంచామృతంతో అభిషేకం జరిపారు. అమ్మవారి జన్మస్థలం వద్ద అర్చకులు పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్ అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి ఎన్.వల్లినాయగం, దేవాదాయశాఖ ఎస్‌ఈ పి.మల్లికార్జున్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు.

గని కార్మికులకు అలవెన్స్ పెంపు!

కొత్తగూడెంటౌన్: వేజ్‌బోర్డు సమావేశంలో అండర్ గ్రౌండ్ అలవెన్స్‌పై సానుకూల స్పందన వ్యక్తమైందని ఏబీకేఎంఎస్ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు ఎ.మాధవనాయక్ తెలిపారు. జేబీసీసీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కోల్‌కతాలో 11వ వేతన ఒప్పందం పదో సమావేశం నిర్వహించారు. కోల్ ఇండియా చైర్మన్‌తోపాటు సింగరేణి డైరెక్టర్ (పా) బలరాం, జీఎం కుమార్‌రెడ్డి, దేశంలోని ఇతర బొగ్గు సంస్థల అధికారులు పాల్గొన్నారు. జాతీయ కార్మిక సంఘాల నాయకుల డిమాండ్లను కోలిండియా యాజమాన్యం అంగీకరించిందని తెలిపారు. అండర్‌గ్రౌండ్ అలవెన్స్ 9 శాతం నుంచి 11.25 శాతానికి, స్పెషల్ అలవెన్స్ 4 శాతం నుంచి ఐదుకు, హెచ్‌ఆర్‌ఏ 2 శాతం నుంచి 2.5కు, ఎల్‌టీసీ రూ.8 వేల నుంచి 10 వేలకు, ఎల్‌ఎల్‌టీసీ 12 నెలల నుంచి 15 నెలలకు పెంచుతూ అంగీకారం కుదిరిందని తెలిపారు. సిక్ లీవ్‌లు 120 నుంచి 150 వరకు పెంపు, అంబేద్కర్ జయంతిని పెయిడ్ హాలీడే ఇవ్వడంతోపాటు మరికొన్ని అంశాలపై ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. మినిమమ్ గ్యారెంటీ బెనిఫిట్ 19 శాతం, ఇంక్రిమెంట్ మూడు శాతంతోపాటు పైన తెలిపిన అంశాలపై డ్రాఫ్ట్ తయారు చేయనున్నారని తెలిపారు. జేబీసీసీఐ సమావేశం శనివారం కూడా జరగనుందని పేర్కొన్నారు.

కొత్తగూడేన్ని వదులుకోం..

- వచ్చే నెల 4న ప్రజాగర్జన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి సీపీఐ కచ్చితంగా బరిలో ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తుల సంగతి ఎలా ఉన్నా పోటీ ఖాయమని, అభ్యర్థి ఎవరనేది అప్పటి పరిస్థితులను బట్టి పార్టీ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం, పాలేరు, భద్రాచలం, పినపాక, వైరా నియోజకవర్గాల్లో తమ పార్టీకి బలం ఉందని, తమ మిత్రపక్షమైన సీపీఎంకు కూడా జిల్లాలో పట్టు ఉందని వివరించారు. ఎన్నికల సందర్భంగా ఇరుపక్షాలు కూర్చుని సీట్ల విషయమై చర్చించుకుంటామని అన్నారు. గతంలో పొత్తుల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు తాము సహకరించినా, తమకు ఆ పార్టీ సహకరించలేదని గుర్తుచేశారు. సింగరేణి సంస్థ నిర్వహణ అస్యవస్తంగా మారిందని, వేతనాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జెన్‌కో నుంచి రావాల్సిన రూ.30 వేల కోట్ల బకాయిలు రాకుండా ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. తమకు సహకరిస్తున్నారనే నెపంతో ఓ ఐఏఎస్ అధికారిని సీఎండీగా సుదీర్ఘకాలం కొనసాగించడం సరికాదన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు కేంద్రం మాయ మాటలు చెబుతూ బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేస్తోందన్నారు. వచ్చే నెల 4న పార్టీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ప్రజాగర్జన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభకు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి అజీజ్ పాషాతో పాటు పువ్వాడ నాగేశ్వరరావు, కవి గోరేటి వెంకన్న, వందేమాతరం శ్రీనివాస్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, నరాటి ప్రసాద్, మాచర్ల శ్రీనివాస్, కె.జమలయ్య, సత్యనారాయణచారి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

విద్యాశాఖలో సీఆర్పీల సర్దుబాటు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో విద్యాశాఖ పరిధిలోని 91 స్కూల్ కాంప్లెక్స్‌లలో పనిచేస్తున్న కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లను అన్ని కాంప్లెక్స్‌లకు సమానంగా సర్దుబాటు చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఖాళీగా ఉన్న కాంప్లెక్స్‌లకు అదనంగా పని చేస్తున్న కాంప్లెక్స్‌ల నుంచి రిసోర్స్ పర్సన్లను సర్దుబాటు చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.సోమశేఖరశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.శ్రీనివాసరావు, పి.ప్రకాష్‌రావు, జి. రమాదేవి, సెక్టోరల్ అధికారులు ఏ.నాగరాజశేఖర్, యస్.కె.సైదులు, ఎన్. సతీష్ కుమార్, సూపరింటెండెంట్ కె.జ్యోతి, సంధ్య, నాగేశ్వరరావు, మోహన్, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

ఉత్పత్తితోపాటు రక్షణకు ప్రాధాన్యమివ్వాలి

మణుగూరు రూరల్ : బొగ్గు ఉత్పత్తితోపాటు రక్షణకు ప్రాధాన్యమివ్వాలని సింగరేణి మైనింగ్ అడ్వైజరీ(కార్పొరేట్) డీఎస్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన మణుగూరు ఏరియాలోని కేపీయూజీ, పీకేఓసీ, మణుగూరు ఓసీలను సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం గనుల అధికారులతో సమావేశమై మాట్లాడారు. బొగ్గు వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు శ్రమశక్తిని, యాంత్రికశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అనంతరం కేసీహెచ్‌పీని సందర్శించి బొగ్గు రవాణాలో రికార్డు సృష్టించాలని అధికారులకు, కార్మికులకు సూచించారు. అనంతరం డీఎస్ ప్రసాద్‌ను సింగరేణి అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, అధికారులు లలిత్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి,నర్సిరెడ్డి, వెంకటరమణ, రమేష్, రాంబాబు, వీరభద్రుడు, రవీందర్ పాల్గొన్నారు.



గని వద్ద మైనింగ్ అడ్వైజరీ ప్రసాద్, అధికారులు

పెద్ద నోటు రద్దు హర్షణీయమే..

- రిజర్వ్ బ్యాంకు నిర్ణయాన్ని స్వాగతించిన పలువురు
- ఈ నెల 23 నుంచి రూ.2 వేల నోటు మార్పిడికి అవకాశం



కొత్తగూడెంఅర్బన్: రూ.2 వేల కరెన్సీ నోటును రద్దు చేస్తూ రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) శుక్రవారం తీసుకున్న నిర్ణయంపై అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. 2016, నవంబర్ 8న కూడా రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన విషయం విదితమే. అప్పుడు సామాన్యులు తమ వద్ద ఉన్న నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ తర్వాత రూ. వెయ్యి నోట్లను పూర్తి రద్దు చేయగా రూ.2 వేలతో పాటు రూ.500 నోట్లను కొత్తగా విడుదల చేసింది. రాను రాను రూ.2వేల నోట్ల చెలామణి తగ్గి బడా వ్యాపారులు, పారిశ్రామికవేత్తల ఖజానాల్లో నల్లధనంగా మూలుగుతున్నాయనే ప్రచారం మొదలైంది. దీంతో రూ.2 వేల కరెన్సీ నోట్లను రద్దు చేస్తూ నిర్ణయం వెలువరించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు జిల్లాలోని బ్యాంకుల్లో రూ.2 వేల నోట్లు కలిగిన వారు సెప్టెంబర్ 30వ తేదీ వరకు డిపాజిట్ చేసుకోవచ్చు.

సామాన్యులకు ఇబ్బంది లేకుండా..



సామాన్య ప్రజలకు, ప్రభుత్వ, సింగరేణి ఉద్యోగులకు బ్యాంకుల్లో నోట్లు మార్చుకునే సమయంలో ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలి. నోట్ల మార్పిడికి ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉంటుంది. బ్యాంకుల్లో తగినంత నగదును అందుబాటులో ఉంచాలి.

–కలవల చంద్రశేఖర్,
సూపరింటెండెంట్ ఇంజనీర్, సింగరేణి

బ్లాక్ మనీ తగ్గే అవకాశం



రూ.2000 నోట్లతో వ్యాపారులకు ఉపయోగం లేదు. జీఎస్టీ వచ్చాక అంతా ఆన్‌లైన్, చెక్కు పేమెంట్లు జరుగుతున్నాయి. అయితే పెద్ద నోట్లను రద్దు చేయడం వల్ల బ్లాక్ మనీ తగ్గే అవకాశం ఉంది. సామాన్యులకు ఇబ్బందులు కలుగకుండా బ్యాంకుల్లో ఏర్పాట్లు చేయాలి.

–మొరిశెట్టి భవానీప్రసాద్,
క్లాత్ మర్చంట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

రద్దు నిర్ణయం మంచిదే..



కేంద్రం రూ.2 వేల నోట్ల చెలామణి ఉపసంహరించుకోవడం మంచి నిర్ణయం. దీనివల్ల అన్ని వర్గాలకు ప్రయోజనం కలుగుతుంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో రూ.2 వేల నోటు ప్రభావం అధికంగా ఉంటుంది. దీనిని నియంత్రించటం మంచి నిర్ణయం.

–మన్నెం జవహర్‌రెడ్డి, వ్యాపారి

ఎక్కువ సమయం ఇవ్వాలి



కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోటు రద్దు చేయడం హర్షణీయం. ఇది ప్రస్తుతం చలామణిలో ఉన్న అంతగా ప్రాచుర్యంలో లేదు. సామాన్యులు తమ వద్ద ఉన్న నోట్లను మార్చుకునేందుకు ఎక్కువ గడువు ఇవ్వాలి. అది కూడా స్థానిక బ్యాంకుల్లో వెసులుబాటు కల్పించాలి.

–కాసర్ల రాజమల్లు, సీనియర్ సిటిజన్

సద్వినియోగం చేసుకోవాలి



రూ.2 వేల నోట్లను రద్దు చేస్తున్నట్లు రిజర్వ్ బ్యాంకు ప్రకటించింది. ఆ నోటును అన్ని బ్యాంకుల్లో మార్పిడి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ నెల 23 నుంచి బ్యాంకుల్లో మార్పిడి చేసుకోవచ్చు. గడువులోగా అందరూ మార్చుకోవాలి.

–భార్గవ్, ఆంధ్రా బ్యాంకు మేనేజర్,
విద్యానగర్

పలు రైళ్లు రద్దు, కుదింపు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడె నుంచి నడిచే పలు రైళ్ల శనివారం నుంచి రద్దు చేయగా, కొన్నింటి రాకపోకలను కుదించినట్లు స్టేషన్ చీఫ్ కమర్షియల్ సూపర్‌వైజర్ జేమ్స్‌పాల్ తెలిపారు. నెక్కొండలో జరుగుతున్న మూడో లైన్ పనుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సిర్పూర్‌కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వచ్చే సింగరేణి ఎక్స్‌ప్రెస్ శనివారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వరంగల్–కొత్తగూడెం మధ్య రద్దు చేశారు. కొత్తగూడెం నుంచి బల్హార్షా వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను ఆదివారం నుంచి జూన్ 7వ తేదీ వరకు కొత్తగూడెం–వరంగల్ మధ్య రద్దు చేశారు. కొత్తగూడెం నుంచి సికింద్రాబాద్ వెళ్లే కాకతీయ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ నుంచి కొత్తగూడెం వచ్చే కాకతీయ ఎక్స్‌ప్రెస్, బెళగావి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను కొత్తగూడెం–కాజీపేట మధ్య ఆదివారం నుంచి జూన్ 7వ తేదీ వరకు, కొత్తగూడెం వచ్చే బెళగావి ఎక్స్‌ప్రెస్‌ను కాజీపేట–కొత్తగూడెం నడుమ ఆదివారం నుంచి జూన్ 6వ తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు.

ఐదేళ్లపాటు భారజలం సరఫరా

బెంగళూరు సంస్థతో భారజల బోర్డు ఒప్పందం

అశ్వాపురం: బెంగళూరుకు చెందిన సిగ్మా ఆల్డ్రిచ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఐదేళ్లపాటు భారజలం సరఫరా చేసేందుకు భారత అణుశక్తి విభాగం, భారజల బోర్డు ఉన్నతాధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముంబైలోని భారత అణుశక్తి విభాగం కార్యాలయంలో శుక్రవారం ఈ ఒప్పందం జరిగింది. మెర్క్ లైఫ్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డ్యూటీరియం లేబుల్ చేసిన సమ్మేళనాలు, అనుబంధ, ఆధారిత ఉత్పత్తుల ఉత్పత్తి కోసం భారజలం వినియోగించనున్నారు. ఈ ఒప్పందంతో డ్యూటిరేటెడ్ ఉత్పత్తుల తయారీ, రసాయనాలు, ఔషధ రంగాల వృద్ధికి ప్రయోజనం ఉంటుందని భారత అణుశక్తి విభాగం కార్యదర్శి, ఏఈసీ చైర్మన్ డాక్టర్ ఏ.కే.మహంతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జితేంద్ర శ్రీవాత్సవ, డైరెక్టర్ వీవీఎస్‌వీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, భారజల కర్మాగారం అశ్వాపురంలో కూడా ఉన్నప్పటికీ బెంగళూరు సంస్థకు ఎక్కడి నుంచి సరఫరా చేస్తారనేది తెలియరాలేదు.



భారజలం సరఫరా ఒప్పందం కార్యక్రమంలో ఇరుసంస్థల అధికారులు

క్లుప్తంగా

స్వర్ణకవచధారుడై దర్శనమిచ్చిన రామయ్య



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని అంతరాలయంలో మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవలు జరిపారు.

గోదావరిలో మునిగి యువకుడు మృతి



కల్యాణ్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని సున్నంబట్టి గ్రామానికి చెందిన చల్లా కల్యాణ్ (21) గోదావరిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కల్యాణ్ గురువారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా, శుక్రవారం చేపల వేటకు వెళ్లిన జాలర్లకు గోదావరిలో కల్యాణ్ మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేశవ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌కు నిప్పు పెట్టిన దుండగులు



అగ్నికి ఆహుతైన ద్విచక్ర వాహనం

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామంలో గోగుల రామకృష్ణకు చెందిన ద్విచక్ర వాహనాన్ని శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. రాత్రి ఆరుబయట వాహనాన్ని నిలిపి నిద్రకు ఉపక్రమించిన రామకృష్ణ తెల్లవారు జామున వాహనం నుంచి మంటలు ఎగిసిపడటంతో మేల్కొని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనపై రామకృష్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

బూర్గంపాడు: మండలంలోని ముసలిమడుగు డబుల్ బెడ్‌రూమ్ ఏరియాకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శుక్రవారం తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ముసలిమడుగు డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన పాడియం సాయిరామ్ (25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఐదేళ్ల కిందట భద్రాచలానికి చెందిన సాయిదుర్గను పెళ్లి చేసుకున్నాడు. వారికి శ్రావికశ్రీ, పునర్నవి చిన్నారులున్నారు. ఇటీవల దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం కూడా దంపతులు గొడవపడ్డారు. ఈ క్రమంలోనే సాయిరామ్ తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి భద్రమ్మ మాత్రం తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు

పాల్వంచరూరల్: ప్లాంటేషన్‌లో మొక్కలను నరికిన ఇద్దరిపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఉల్వనూరు పంచాయతీలోని కొత్తూరు గ్రామశివారులో వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ అధికారులు వేసిన ప్లాంటేషన్‌లో రూ.1,08,200 విలువైన 800 మొక్కలను నరికారు. కొత్తకొత్తూరుకు చెందిన మాడే సోనా, బండి హేమ్లా మొక్కలను నరికారని మందెరకలపాడు బీట్ ఆఫీసర్ కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీనివాస్ ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పాల్వంచరూరల్: అక్రమంగా 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నరేశ్ కథనం ప్రకారం.. మణుగూరు నుంచి టీఎస్ 08 యూడీ 9639 నంబర్ గల లారీలో రేషన్ బియ్యాన్ని కాకినాడకు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బస్టాండ్ సెంటర్‌లో వాహనాల తనిఖీలు చేపట్టగా రేషన్ బియ్యం లారీ పట్టుబడింది. అందులో పరిశీలించగా రూ.3లక్షల విలువైన రేషన్ బియ్యం బస్తాలు ఉన్నాయని, లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సింగరేణి ఉద్యోగాల పేరిట టోకరా..

- రూ.50 లక్షలమేర వసూళ్లు
- కొందరికి నకిలీ పత్రాలు ఇచ్చి పని చేయించిన వైనం
- అక్రమార్కుడి దూతను పోలీసులకు అప్పగించిన బాధితులు



మధ్యవర్తి (ఫోన్‌లో మాట్లాడుతున్న వ్యక్తి)ని నిలదీస్తున్న బాధితులు

సత్తుపల్లి: సింగరేణి సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.50లక్షలకుపైగా వసూలు చేసిన వ్యక్తి అక్రమాలు వెలుగుచూశాయి. ఒక్కొక్కరి నుంచి రూ.25 వేలు మొదలు రూ.5 లక్షల వరకు దండుకున్నట్లు సమాచారం. ఈమేరకు ఆయన అక్రమాలు బయటపడడంతో బాధితులు శుక్రవారం సత్తుపల్లికి పిలిపించి పోలీసులకు పట్టించాలని భావించగా సదరు వ్యక్తి తన దూతను పంపించడంతో పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెంకు చెందిన శరత్‌చంద్ర సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో క్యాంటీన్, బెల్ట్ క్లీనింగ్, సీహెచ్‌పీ(కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్)లో సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. దినసరి కూలీలుగా ఇక్కడ 50 మందికి అవకాశం ఉండడంతో బీటెక్, డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులకు సింగరేణి సంస్థలో పర్మినెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికాడు. ఈమేరకు సత్తుపల్లి, కల్లూరు, మధిర, వైరా, కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన వారి నుంచి కొందరు ఏజెంట్ల ద్వారా రూ.లక్షల్లో వసూలు చేశారు. సత్తుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భద్రం ద్వారా తాళ్లమడకు చెందిన కొందరి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆ గ్రామానికి చెందిన బీజాన్‌బీ తదితరులు వెల్లడించారు. కాగా, సింగరేణిలో ఉద్యోగం వస్తుందనే భావనతో పలువురు ఇళ్ల స్థలాలు, పొలాలు అమ్మి డబ్బులు కట్టినట్లు సమాచారం.

అనుమానంతో ఆరా

కొందరికి ఉద్యోగాలు వచ్చినట్లు నకిలీ పత్రాలు ఇచ్చిన శరత్‌చంద్ర వారితో పని చేయించుకుంటున్నారు. కానీ ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన వీరు ప్రశ్నిస్తే తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో కొందరికి అనుమానం రాగా.. శరత్‌చంద్రకు ఫోన్ చేసి మరో ఇద్దరికి ఉద్యోగాలు కావాలి, డబ్బులు తీసుకునేందుకు సత్తుపల్లి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు రావాలని సూచించారు. అయితే, శరత్‌చంద్ర తన వద్ద పనిచేసే రుద్రంపూర్‌కు చెందిన ఎ.హరీశ్‌ని పంపించాడు. అప్పటికే వల వేసి ఉన్న బాధితులు శరత్‌చంద్ర వస్తేనే హరీశ్‌ను వదిలిపెడతామని చెప్పగా గంటలోగా చేరుకుని డబ్బులన్నీ ఇస్తాను, గొడవ చేయకండి అంటూ చెప్పాడు. కానీ రెండు, మూడు గంటలు దాటినా రాకపోవడంతో బాధితులంతా కలిసి హరీశ్‌ను సత్తుపల్లి ఎస్సై బి.రాముకు అప్పగించారు. ఈ విషయమై సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో నియామకాలన్నీ పారదర్శకంగా జరుగుతాయని స్పష్టం చేశారు. ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కాగా, కొత్తగూడెంకు చెందిన సూర్య కన్‌స్ట్రక్షన్స్‌కు సీఎస్పీ కాంట్రాక్టు మరో నెల మాత్రమే ఉందని, సబ్ కాంట్రాక్టర్ల వ్యవహారంతో సంస్థకు సంబంధం లేదని చెప్పారు. ఇదే విషయమై సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్ మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగాల పేరుతో జరిగిన అక్రమ లావాదేవీలపై విచారణ చేస్తున్నామని తెలిపారు. బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉత్తుత్తి పత్రాలు..



డబ్బులు కట్టామని చెబుతున్న బాధితులు

సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తానని శరత్‌చంద్ర డబ్బు వసూళ్లు చేశాక ఆరు నెలల నుంచి కిష్టారం ఓసీ, కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్ చుట్టూ తిప్పుకుంటున్నారని గజ్జల రాము, జుంజూరు గోపాలరావు, కొంపల్లి ప్రభాకర్‌రావు తదితరులు ఆరోపించారు. కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో రీడింగ్ తీయడం, కన్వేయర్ బెల్ట్ వద్ద పనులతో పాటు మెడికల్ ఫిట్‌నెస్ వర్క్, డంపర్ వద్ద వివరాల నమోదు ఉద్యోగాల పేరిట కొందరు నకిలీ నియామక పత్రాలు ఇచ్చి పని కూడా చేయించుకున్నాడని తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్



జూలూరుపాడు: మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు/చంద్రుకొండ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ హెచ్చరించారు. జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం రైతువేదికలో కొత్తగూడెం ఏడీఏ టి.కరుణశ్రీ ఆధ్వర్యంలో కొత్తగూడెం డివిజన్ పరిధిలోని కొత్తగూడెం, చుంచుపల్లి, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు మండలాలకు చెందిన విత్తన డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. అలాగే, చంద్రుగొండ మండలం గానుగపాడులో ఏడీఏ అఫ్జల్‌బేగం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రయం చట్టరీత్యా నేరమన్నారు. నకిలీ విత్తనాలను ఎవరైనా విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత విత్తన చట్టం, లైసెన్స్ తీసుకోవడం, లావాదేవీలపై ఏడీఏలు డీలర్లకు అవగాహన కల్పించారు. సీఐ వసంతకుమార్, ఎస్‌ఐలు గణేశ్, జి.విజయలక్ష్మి, షహీనా, ఏఓలు ఎస్.రఘుదీపిక, వినయ్, నర్మద, రాజేశ్వరి, గోపాల్‌రావు, రాకేశ్, శంకర్, ఏఈఓలు పాల్గొన్నారు.

కఠిన చర్యలే..

పినపాక: రైతులకు నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగుమందులు విక్రయించినవారిపై కఠినచర్యలు ఉంటాయని, బాధ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీఎస్పీ రాఘవేంద్రరావు హెచ్చరించారు. పినపాకలో ఎరువుల దుకాణాల యజమానులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఏడీఏ తాతారావు, తహసీల్దార్ దుర్గాప్రసాద్, ఏఓ వెంకటేశ్వర్లు, సీఐ రాజగోపాల్, ఎస్‌ఐలు నాగుల్‌మీరా, జీవన్‌రాజు, ఏఈఓ లక్ష్మణ్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

లైసెన్సులు రద్దు చేస్తాం..

టేకులపల్లి: ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయడమే కాక లైసెన్స్ రద్దు చేస్తామని ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి హెచ్చరించారు. టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేయాలని చూస్తే సహించేది లేదని తెలిపారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి, ఏఈఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేయొద్దు..

పాల్వంచరూరల్: నకిలీ విత్తనాలు, పురుగుమందులు అంటగట్టి రైతులను మోసం చేయొద్దని, అలా చేసినవారిపై కఠినచర్యలు తీసుకుంటామని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విత్తన డీలర్లు, వ్యాపారులతో అవగాహన సమావేశం నిర్వహించగా డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఏఓ శంకర్, సీఐ నాగరాజు, ఎస్‌ఐలు నరేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిషేధిత చైనా ఉప్పు వాడితే చర్యలు



తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

పాల్వంచరూరల్: హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిషేధిత చైనా ఉప్పును వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఫరీద్, జవాన్లు తనిఖీ చేశారు. 2018, మార్చి 3న అజినోమోటో (మోనోసోడియం గ్లుటమేట్ టేస్టింగ్ సాల్ట్ - ఉప్పు)ను సుప్రీంకోర్టు నిషేధిస్తూ తీర్పు చెప్పిందని, ఈ నిషేధించిన ఉప్పును వినియోగిస్తే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని గ్రీన్ ఎర్త్ సొసైటీ బాధ్యులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు తనిఖీలు చేపట్టి నిర్వాహకులను హెచ్చరించారు.

రోడ్డెక్కిన అన్నదాతలు



రైతుల రాస్తారోకోతో భారీగా స్తంభించిన ట్రాఫిక్

- ధాన్యం కొనుగోలు చేయాలంటూ రాస్తారోకో
- రెండు గంటలపాటు నిలిచిపోయిన వాహనాలు

అశ్వాపురం: ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. అశ్వాపురం మండలం మొండికుంటలోని మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేపట్టారు. నిర్దేశిత తేమ ఉన్నా కొనుగోలు చేయడం లేదని, కాంటా వేశాక మిల్లర్ల కొర్రీలతో నష్టపోతున్నామని ఆరోపించారు. రెండు గంటలపాటు రాస్తారోకో సాగగా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో సీఐ శ్రీనివాసరావు చేరుకుని సంబంధిత అధికారులతో మాట్లాడించగా ఆందోళన విరమించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌రావు, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని బాగా ఆరబెట్టాలని రైతులకు సూచించడంతో పాటు కొనుగోళ్లలో వేగం పెంచాలని నిర్వాహకులకు, కోత విధించొద్దని మిల్లర్లకు సూచించారు. కాగా, ప్రభుత్వం తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించినా అధికారులు అలా చేయడంలేదని, ఒకవేళ కాంటా వేసినా మిల్లర్లు దిగుమతి చేసుకోకపోగా క్వింటాకు ఐదు నుంచి పది కేజీల కోత విధిస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు.

గుండెపోటుతో కరాటే మాస్టర్ మృతి

పెనుబల్లి: మండలంలోని వీఎం.బంజర్‌కు చెందిన కరాటే మాస్టర్ శ్రీకాంత్(35) గుండెపోటుతో మృతి చెందాడు. సత్తుపల్లిలో శుక్రవారం విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చిన ఆయన వీఎం.బంజర్‌లోని ఇంటికి వస్తుండగా గుండెపోటుకు గురై కుప్పకూలాడు. ఇది గమనించిన స్థానికులు ఆయనను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు సీపీఆర్ చేసినా ప్రాణం దక్కలేదు. ఇరవై ఏళ్ల క్రితం వరంగల్ జిల్లా నర్సంపేట నుండి పెనుబల్లికి వచ్చి స్థిరపడిన శ్రీకాంత్ కరాటే స్కూల్ స్థాపించి వందలాది మంది విద్యార్థులకు కరాటే నేర్పించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఆనందాపురం గ్రామానికి చెందిన యాసా అనిల్ (25) మండల కేంద్రంలో గౌతమీనగర్‌కాలనీలోని ఇళ్లల్లో పాలు పోసి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో గొల్లగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన వద్ద కొత్తగూడెం నుంచి మణుగూరు వైపు వస్తున్న పాల వ్యాన్ బైక్‌ను ఢీకొట్టడంతో అనిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అశ్వాపురం పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గోతిలో పడి గేదె మృతి

రెండు రోజులపాటు అందులోనే ఉండటంతో యజమాని కంటతడి

చంద్రుగొండ: మేత కోసం వెళ్లిన పాడి గేదె ప్రమాదవశాత్తు గోతి (వర్రె)లో పడి మృతిచెందిన ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగుచూసింది. మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు సుగంధపు కృష్ణవేణి కథనం ప్రకారం.. రెండు రోజుల కిందట మేతకు వెళ్లిన పాడి గేదె తిరిగిరాలేదు. దీంతో కృష్ణవేణి కుటుంబ సభ్యులతో కలిసి వెతికింది. ఈ క్రమంలో శుక్రవారం గ్రామశివారులోని తిప్పనపల్లి వాగు పరిసరాల్లోని పంటచేల మధ్య గోతి (వర్షపు నీటి ప్రవాహపు వర్రె)లో మృతి చెంది ఉంది. దీంతో బాధితరైతు కృష్ణవేణి కన్నీరుమున్నీరైంది. రెండు రోజుల కిందట ఆ ప్రాంతంలో రెండు గేదెలు తలపడ్డాయని ఆ క్రమంలోనే గేదె గోతిలో వెల్లకిలా పడిపోయిందని కాపరులు 'సాక్షి'కి తెలిపారు. అయితే, గేదె లేచి వెళ్లిపోయి ఉంటుందని భావించామని వారు చెబుతున్నారు. ఆ గోతిలో నుంచి లేచే పరిస్థితి లేక గేదె మరణించింది.

మొక్కలు నాటడంలో జాగ్రత్తలు తీసుకోవాలి



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు

గుండాల: బృహత్ పల్లె ప్రకృతి వనాలతో పాటు రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాలలో మొక్కలు నాటడంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు అన్నారు. మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న సాయనపల్లి, దామరతోగు బృహత్ పల్లె ప్రకృతి వనాలకు సంబంధించి స్థలాలను పరిశీలించారు. ఈ వనాలలో జూన్‌లో సైతం మొక్కలు నాటేందుకు కార్యాచరణ రూపొందించాలని కార్యదర్శులకు సూచించారు. ఎక్కువగా రైన్ ట్రీ, గుల్‌మార్ పెల్ట్రోఫామ్ మొక్కలను నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. తడిచెత్త, పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రతీ రోజు ఉపాధి పనులపై పర్యవేక్షణ ఉండాలని, మండలంలో ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఆయన వెంట మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ వలీ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల లైసెన్స్‌లు రద్దు



దమ్మపేటలోని మెడికల్ షాపు

దమ్మపేట: మండల కేంద్రంలోని మూడు మెడికల్ షాపుల లైసెన్స్‌లను జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్ రద్దు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సాధారణ తనిఖీల్లో భాగంగా మండల కేంద్రంలోని పలు మెడికల్ షాపులలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బుధవారం సాయంత్రం తనిఖీ నిర్వహించగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. తనిఖీ చేసిన విషయం వాస్తవమేనని, తనిఖీ అనంతరం పలు మెడికల్ షాపుల రికార్డులు, బిల్లులను స్వాధీనం చేసుకుని, క్షుణ్ణంగా పరిశీలించగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. షాపులో ఉన్న స్టాకుకు సరైన బిల్లులు లేకపోగా, అర్హత కలిగిన డాక్టర్ నుంచి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. శుక్రవారం పూర్తిస్థాయి పరిశీలన, విచారణ అనంతరం మూడు మెడికల్ షాపుల లైసెన్స్‌లను రద్దు చేస్తున్నామని వెల్లడించారు. దమ్మపేట గ్రామంలో శివబాలాజీ హోల్‌సేల్ మెడికల్ ఏజెన్సీస్, భారత్ మెడికల్ స్టోర్స్, మందలపల్లి గ్రామంలో సాయిదుర్గ మెడికల్ స్టోర్స్‌ల లైసెన్స్‌లను రద్దుచేశామని వివరించారు.

చికిత్స విషయంలో వాగ్వాదం



సూపరింటెండెంట్‌తో వాగ్వాదానికి దిగిన నాయకులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ఓ మహిళకు చికిత్స చేసే విషయంలో ఆమె బంధువులు, వైద్యుడి మధ్య శుక్రవారం వాగ్వాదం చోటుచేసుకుంది. టీబీ అనుమానితురాలైన ఆమెను గురువారం ఆస్పత్రిలో చేర్పించగా ఐసీయూలో చికిత్స చేస్తున్నారు. ఇక శుక్రవారం ఐసీయూలో మరో నలుగురు చేరగా, సదరు మహిళను ఐసోలేషన్‌కు తరలించాలని వైద్యులు నిర్ణయించారు. అప్పటి వరకు ఐసీయూలోనే ఉన్న ఆమెను చూసేందుకు కుటుంబీకులు రావడం, ఇంతలోనే ఐసోలేషన్‌కు తరలించే క్రమాన ఆమె కుటుంబ సభ్యులు.. ఐసీయూ ఇన్‌చార్జ్ డాక్టర్ కిషన్, సూపరింటెండెంట్ రామకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. ఈ విషయంలో పలుమార్లు వాగ్వాదం జరగగా, వైద్యులు వ్యవహరించిన తీరు కూడా ఆరోపణలకు తావిచ్చింది. ఇంతలోనే గిరిజన సంఘాల నాయకులు చేరుకుని వాగ్వాదానికి దిగగా చివరకు వివాదం సద్దుమణిగింది.

ఖాళీ బిందెలతో గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న మహిళలు

పాల్వంచరూరల్: మండలంలోని మందెరకలపాడు గ్రామ పంచాయతీలోని ఒంటిగుడిసె ఆదివాసీ గిరిజనులు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తన వాహనాన్ని ఆపి, గిరిజన మహిళల వద్దకు వెళ్లి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సోలార్ బోరు పనిచేయడం లేదని, దీంతో తాగునీరు లేక మైలుదూరం వెళ్లి తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని మహిళలు తెలిపారు. తాను బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.